# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 213 పేజీలు : 8 వెల : రూ.2/- శుక్రవారం 28 ఆగస్టు 2026 Ysr kadapa

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం

- ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమం
- క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 27:** దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అలథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీసా యన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకు పోవడానికి యువశక్తితో మిగతా2లో...

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- ఏడుగురు మృతి...కొందరికి తీవ్ర గాయాలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రులు
- సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు




**పల్నాడు,మన జనప్రగతి ఆగస్టు 27:** పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరి పేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మిగతా2లో...

## మత్స్యకారులు అందరూ సురక్షితం



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 27:** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ కోల్పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా బయటపడ్డారు. అల్లవరం మండలం నుండి చేపల వేటుకు వెళ్లిన బోటులోని సిబ్బంది అందరూ పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నారు.

మిగతా2లో...

## రెండోదశ భూసమీకరణ రైతులకు రుణమాఫీ

- మంగళగిరికి కూడా అమరావతి నుంచే నీరు
- సిఆర్‌డిఎ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి నారాయణ



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 27:** మంగళగిరికి రాజధాని అమరావతి నుంచి తాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 65వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న వివిధ పరిపాలన అనుమతులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఆ వివరాలను మంత్రి నారాయణ వివరించారు. 06.01.2026 ముందు వరకూ లోన్లు తీసుకున్న రెండో దశ భూసమీకరణ రైతులకు కూడా రుణమాఫీ మిగతా2లో...

## 1,600 మంది గల్లంతు



**నేపాల్,మన జనప్రగతి ఆగస్టు 27:** నేపాల్-టిబెట్ సరహద్దుల వెంబడి సంభవించిన మెరుపు వరదల బీభత్సంలో 288 మంది భారతీయులు గల్లంతయ్యారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ప్రకటించింది. మరో 200 మంది భారతీయ పౌరులు చైనా వైపు టిబెట్‌లో చిక్కుకుపోయినట్టు తెలిపింది. వారికి సహాయం అందించేందుకు రెండు దేశాల అధికారులతో భారత్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్టు పేర్కొంది. నేపాల్‌లో సహాయక చర్యలు వేగం పుంజుకున్న నేపథ్యంలో సంక్షోభాన్ని అధిగమించేందుకు ఆ దేశానికి భారత్ భుజం భుజం కలిగి అండగా మిగతా2లో...

## హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీలో 98.47% పూర్తి

- మిగిలిన 5,269 మందికి 31లోగా ఇచ్చేందుకు చర్యలు
- కొత్త వారి కోసం కూడా రాష్ట్రానికి 1.90 లక్షల డోసుల వ్యాక్సిన్ త్వరలో రాక
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 27:** హెచ్ పీవీ టీకా (వ్యాక్సిన్) పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా 98.47 శాతం పూర్తయినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ బారి నుంచి సంరక్షించే చర్యల్లో భాగంగా ఈ వ్యాక్సిన్ ను 14-15 సంవత్సరాల మధ్య ఉన్న బాలికలకు ఉచితంగా అందచేస్తున్నామని చెప్పారు. స్వర్ణ గ్రామ/వార్డు లెక్కల ప్రకారం ఈ ఏడాది మార్చి నాటికి 14 ఏళ్లు వచ్చి 15 ఏళ్లు దాటని బాలికలు 3,45,377 మంది ఉండగా వీరిలో గురువారం మధ్యాహ్నం నాటికి మిగతా2లో...

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 27:** లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన మిగతా2లో...

## ఆనాడు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఈ దుస్థితి వచ్చేదా..?

- జగన్ దుర్నీతి వల్ల ప్రాజెక్టులు పూర్తి కాలేకుండా పోయాయి
- గత వైఫల్యాలను కప్పిపుచ్చి మాట్లాడడం విడ్డూరంగా ఉంది
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు



**విశాఖపట్నం,మన జనప్రగతి ఆగస్టు 27:** ఈరోజు రాష్ట్రంలో వ్యవసాయం దెబ్బతినడానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగనే కారణమని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఆ రోజు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే.. నేడు ఎల్ నినో వచ్చినా సరే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. గురువారం విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తు కంటే అతి పెద్ద విపత్తు గొడ్డలి పార్టీ అని అభివర్ణించారు. ఎల్ నినో కంటే పెద్ద విపత్తు వైఎస్ జగన్ మిగతా2లో...

## ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

- 80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు
- కన్నీటి పర్యంతం అయిని జగ్గీవాసుదేవ్



2లో

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబా లకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆటోను ఢీకొని ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంరతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు హోంమంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంటెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ.. మృతుల కుటుంబాలకు పల్లా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డు ప్రమాద మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. చిలకలూరిపేట పట్టణంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడు జరగలేదని.. ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం తనను కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీలో 98.47% పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

3,40,108 మంది (98.47%)కి వ్యాక్సిన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన 5,269 మంది బాలికలకు ఈ నెల 31లోగా వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం ద్వారా మొదట్లో ఉన్న అపోహలు దూరం కావడంతో తమ కుమార్తెలకు వ్యాక్సిన్ వేయించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారని మంత్రి పేర్కొన్నారు. తొలుత ఆగస్టు చివరి నాటికి నిర్దేశించిన వారికి వ్యాక్సిన్ పంపిణీ పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 98.47% మేర పురోగతి సాధించడం విశేషం. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో వ్యాక్సిన్ పంపిణీ తక్కువగా ఉందన్న ఉద్దేశంతో డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం గురువారం సమాచారాన్ని పంపించింది. అలాగే 14 ఏళ్లు నిండిన బాలికలకు కూడా వ్యాక్సిన్ ఇచ్చేందుకు కేంద్రం ప్రభుత్వం త్వరలో 1,90,890 డోసుల వ్యాక్సిన్ ను రాష్ట్రానికి పంపించబోతుంది. 14 ఏళ్ల బాలికలు తల్లిదండ్రులతో కలిసి నేరుగా పీహెచ్సీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు వెళ్లాలనిఅధికారులు సూచించారు.వ్యాక్సిన్ పంపిణీ పురోగతిని అనుసరించి కేంద్రం రాష్ట్రానికి తగిన ప్రాధాన్యనీ ఇస్తోంది. ఈ వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభమైన అనంతరం రెండు దపాలుగా కలిపి రాష్ట్రానికి 3,81,780 డోసులు రాష్ట్రానికి అందాయి.

దీనికి సమర్థంగా సద్వినియోగం చేసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. డిసెంబరు 31 అనంతరం హెచ్పీవీ వ్యాక్సిన్ పంపిణీని రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో జతచేస్తారు. వ్యాక్సిన్ పొందిన 3.40 లక్షల మంది బాలికలకు సంబంధించి ఎటువంటి రియాక్షన్ కేసులు నమోదు కాలేదని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు తెలిపారు. " గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ను నివారించడంలో హెచ్ పీవీ వ్యాక్సిన్ కీలకపాత్ర పోషిస్తోంది. ఈ వ్యాక్సిన్ అత్యంత ప్రభావంతమైంది. సురక్షితమైంది కూడా. టీకా ఇచ్చిన అనంతరం బాలికలను 30 నిమిషాలపాటు అక్కడే వేచి ఉంటున్నారు. రాష్ట్రంలో కోల్డ్ చైన్ (వ్యాక్సిన్ భద్రపరిచే) సౌకర్యం కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందిస్తున్నారు. గార్డాసిల్-4 క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సింగిల్ డోస్ విధానంలో 0.5 మి.లీ. మోతాదుగా ఎడమ పైభుజంలో ఇంట్రామస్క్యులర్‌గా ఇస్తున్నారు" అని చక్రధర్‌బాబు వివరించారు. **జిల్లాల వారీగా టీకా సాధన** 100 శాతం, అంతకంటే ఎక్కువ సాధించిన జిల్లాలు: అనకాపల్లి (103.93%), బాపట్ల (103.54%), చిత్తూరు (102.15%), కాకినాడ (103.51%), కోనసీమ (104.12%), కృష్ణా (103.52%), కర్నూలు (100.72%), మార్కాపురం (112.64%), నంద్యాల (101.83%), ఎన్‌టీఆర్ (100.58%), పల్నాడు (103.49%), పార్వతీపురం మన్యం (101.51%), తిరుపతి (103.67%), వైఎస్సార్ (105.00%).90 నుంచి 99.99 శాతం సాధించిన జిల్లాలు: అనంతపురము (94.57%), అన్నమయ్య (95.81%), తూర్పు గోదావరి (99.52%), ఏలూరు (94.30%), ప్రకాశం (96.45%), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (95.22%), శ్రీ సత్యసాయి (96.37%), శ్రీకాకుళం (98.12%), విశాఖపట్నం (92.31%), విజయనగరం (98.84%), పశ్చిమ గోదావరి (99.19%).90 శాతం కంటే తక్కువ సాధించిన జిల్లాలు: అల్లూరి సీతారామరాజు (54.51%), గుంటూరు (87.20%), పోలవరం (73.68%).

# యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

(మొదటి పేజీ తరువాయి)

బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూట మి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమి టేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పం దన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

# ఆనాడు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఈ దుస్థితి వచ్చేదా..?

(మొదటి పేజీ తరువాయి)

అని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టులు గాడిలో పెట్టామని తెలిపారు. ముఖ్యమంత్రిగా పని చేసిన జగన్.. తన పాలనను గుర్తుపెట్టుకోకుండా మాట్లాడడం బాధగా ఉందన్నారు. ఎల్ నినో పట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. రైతుల పట్ల ప్రేమ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని వైసీపీ అధినేత జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. సభలో అన్నింటికీ సమాధానాలు చెబుతామని పేర్కొన్నారు. సెంబ్లీకి వస్తే ఐదేళ్లలో చేసిన అన్యాయాలను నిలబెట్టి.. చెబుతామంటూ జగన్‌కు స్పష్టం చేశారు. క్రిమినల్ ముసుగులో ఓ రాజకీయ పార్టీ పెట్టడం వల్ల ఇలా ఉన్నాడని.. లేకుంటే ఎక్కడ ఉండే వాడో కూడా తెలియదని జగన్‌ను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. రెడ్ బుక్ ఇంప్లిమెంట్ చేస్తే.. ఎవరైనా ఉంటారా? అని వైసీపీ అధినేతను సూటిగా ప్రశ్నించారు.

తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మ వద్ద కక్ష సాధింపులు ఉండవని కుండబద్దలు కొట్టారు. వైసీపీ హయాంలో బలహీన వర్గాలపై దమనకాండకు దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన మాయ మాటలు బీసీలు నమ్మరని అన్నారు. బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్‌ని తగ్గించింది జగన్మోహన్ రెడ్డి అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. టీడీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందని అన్నారు. కానీ వైసీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందా? అని వైఎస్ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. ప్రస్తుతం తాము బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని చూస్తే.. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ జగన్‌పై అచ్చె న్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను భయపెట్టి, ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శిం చారు. ఇప్పుడు ఏకగ్రీవాలు అయితే సీట్లు ఇవ్వనంటూ భయపెడుతున్నారని ఆరోపించారు. తిరిగి ఎన్నికలు సాఫీగా జరిగితే తామే గెలుస్తామని వైఎస్ జగన్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు.

# దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# మత్స్యకారులు అందరూ సురక్షితం

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారందరినీ వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. పడవతో పాటు ఆచూకీ కోల్పోయిన ఏడుగురిలో అంతా సురక్షితంగా ఉండడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరం శ్రమించిన గాలింపు బృందాలకు, అధికార యంత్రాంగానికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులతో సముద్రంలోకి వెళ్లిన బోటు సాకేంతిక లోపంతో పనిచేయక, గాలులకు వేరే ప్రాంతానికి కొట్టుకుపోయింది. నిర్ణీత గడువు దాటినా తిరిగి రాలేదనే విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు... దీన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. స్వయంగా మంత్రులను పంపి గాలింపును పర్యవేక్షించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్ని మార్గాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఏ మాత్రం నిరాశ చెందకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. కోనసీమ తీరం నుంచి పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండొచ్చనే అంచనాతో పశ్చిమ బెంగాల్ కోస్ట్ గార్డ్ విభాగాలను, అక్కడ స్థానికంగా ఉన్న శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ విభాగాల సహకారాన్ని కూడా తీసుకున్నారు. అన్ని ప్రయత్నాలు ఫలించి శంకర్‌పూర్ సమీపంలో బోటును, అందులోని ఏడుగురు మత్స్యకారులను రక్షించగలిగారు. అలాగే మత్స్యకారుల ఆచూకీ లభ్యమైన వెంటనే ఆ వివరాలను వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులను స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

# రెండోదశ భూసమీకరణ రైతులకు రుణమాఫీ

(మొదటి పేజీ తరువాయి)

వర్తింప చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారని మంత్రి నారాయణ వివరించారు. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్‌కు ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి చెప్పారు. మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసినట్లు తెలిపారు. ఎల్‌పీఎస్ రోడ్లను సీసీకి బదులు బీటీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 29 గ్రామాల లే ఔట్ రోడ్లు బీటీగా మార్చేందుకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన వివరించారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా అంగీకారం తెలిపామని అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐవోసీఎల్ గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ పరిపాలన అనుమతులకు ఆమోదం లభించింది. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# 1,600 మంది గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తుందని ప్రకటించింది. ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ గురువారంనాడిక్కడ మీడియాతో ఆ వివరాలు తెలియజేశారు. 'ఆచూకీ తెలియకుండా పోయిన 288 మంది భారతీయుల్లో త్రిశూలి-1 విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది ఉన్నారు. ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం వారి ఆచూకీ కోసం ప్రాజెక్టు అధికారులతో సంప్రదిస్తోంది.తమిళనాడు నుంచి 37 మంది, 49 మందితో కూడిన రెండు పర్యాటక బృందాలు ఉన్నాయి. వీరు సమ్రాట్, ఫ్లై ఎవరెస్ట్ ట్రావెల్ ఏజెన్సీల ద్వారా కైలాస్ మానసరోవర్ యాత్రకు వెళ్లారు. పశ్చిమబెంగాల్ నుంచి 32 మంది, కేరళ నుంచి 33 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 62 మంది ఉన్నారు. సహాయక చర్యల విషయంలో నేపాల్ అధికారులతో సంప్రదిస్తున్నాం' అని జైశ్వాల్ చెప్పారు. ఇంతవరకూ తమిళనాడుకు చెందిన 21 మందిని కాపాడినట్టు జైశ్వాల్ తెలిపారు. చైనా వైపు 200 మంది భారతీయులు కోసం విజ్ఞప్తి చేస్తున్నారని చెప్పారు. వీరిలో 95 మంది గార్చస్‌లో ఉన్నారని, వారు నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ముందుకు సాగుతున్నారని చెప్పారు. మరో నలుగురు గీలాంగ్ నగరంలో, 13 మంది జుటుల్పుక్‌లో ఉన్నారన వివరించారు. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పరిస్థితి ఎక్కడికప్పుడు మారుతోందన్నారు. భారతీయులను రక్షించేందుకు సంబంధిత అధికారులతో భారత నిరంతం సంప్రదింపులు సాగిస్తోందన్నారు.

# ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

**చెన్నై,మన జనప్రగతి ఆగస్టు 27:** ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామనుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజీ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటి పర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచు చరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రయళం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

# వేరుశనగ విత్తనాల పంపిణీలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి



దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 27:-సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం (ఏఐకేఎస్) మండల నాయకులు రామాంజనేయులు, వెంకటరాముడు డిమాండ్ చేశారు.గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి దేవనకొండ వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ ఇప్పటివరకు బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.కేంద్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై రైతులకు ఉచితంగా అందించాల్సిన వేరుశనగ విత్తనాలను కొందరు అధికారులు అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. రైతులకు ఈ పథకం గురించి ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, అధికారులు ప్రచారం చేయకపోవడంతో అర్హులైన రైతులు ప్రయోజనం పొందలేకపోయారని అన్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2025 ఖరీఫ్, రబీతో పాటు 2026 ఖరీఫ్‌కు రైతుల కోసం కేటాయించిన విత్తనాలను కూడా అక్రమంగా విక్రయించినట్లు ఆరోపించారు. సబ్సిడీలు, సంక్షేమ పథకాలు రైతులకు చేరకుండా మధ్యలోనే దారి మళ్లిస్తే సహించేది లేదన్నారు.విత్తనాల పంపిణీలో జరిగిన అవకతవకలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, అక్రమంగా తీసుకున్న మొత్తాన్ని రికవరీ చేయాలని కోరారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి, అవినీతికి పాల్పడినట్లు తేలిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. రైతులు, ఏపీ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థులకు బయోజీమ్ ప్రగతి స్కాలర్‌షిప్ పంపిణీ



దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 27:- దేవనకొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోస్టాట్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు బయోజీమ్ ప్రగతి స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి రూ.3,000 చొప్పున స్కాలర్‌షిప్ అందజేశారు.ఈ సందర్భంగా కంపెనీ టెరిటరీ మేనేజర్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ..గత 40 సంవత్సరాలుగా బయోస్టాట్ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి నుంచి 10వ తరగతికి ప్రమోట్ అయిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తోందన్నారు. పేద విద్యార్థులు విద్యలో రాణించేందుకు సంస్థ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో దేవనకొండ వెంకట సాయి ట్రేడర్స్ నిర్వాహకులు సదాశివరావు, వేణుగోపాలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్, ఉపాధ్యాయులు విఠల్, షంషాద్ బేగం, సుజాత, కంపెనీ సేల్స్ ఆఫీసర్ రఘు, సిబ్బంది రామాంజనేయులు, వీరుపాపురం రవి, ఎమ్మిగనూరు రవి తదితరులు పాల్గొన్నారు.

# నూతన రామాలయ నిర్మాణానికి బీటెక్ రవి శంకుస్థాపన

**- అంకాలమ్మ గూడూరు కొత్తపాలెంలో ఘనంగా పూజా కార్యక్రమాలు**





సింహాద్రిపురం మన జనప్రగతి ఆగస్టు 27:మండల పరిధిలోని అంకాలమ్మ గూడూరు కొత్తపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీరాముడి దేవాలయ నిర్మాణానికి పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి గురువారం భూమిపూజ చేసి,శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు.అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందాలని,శ్రీరాముడి కృపాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కావాలని కోరుతూ,గ్రామ ప్రజల ఆధ్యాత్మిక,అభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకు లు బాబు రెడ్డి, సాంబశివరెడ్డి,సతీష్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి,ధ్రువకుమార్ రెడ్డితో పాటు కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు,గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లీగల్ ఎయిడ్ ప్యానల్ లాయర్స్ విధులు పై రివ్యూ



కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్ట్ 27:-జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి సూచనల మేరకు కమిటీ మెంబర్స్ అయినా మొదటి అదనపు జిల్లా జడ్జి పి. కమలాదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, బి. లీలా వెంకట శేషాద్రి కర్నూలు కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ లో ప్యానల్ లాయర్స్ విధులు పై రివ్యూ మీటింగ్" హైబ్రిడ్ మోడ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ లాయర్స్ విధులు, చట్టపరమైన సలహాలు, కేసుల వివరాలు మరియు పరిష్కారము మొదలగు అంశాలను వివరించారు. అలాగే కేసుల యొక్క స్థితిగతులను తెలుసుకొని వాటిని ఏ విధంగా త్వరిత గతిన పరిష్కరించాలో అనే దానిపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సులోచన, ప్యానల్ న్యాయ వాదులు పాల్గొన్నారు.

# కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

## పత్తికొండలో న్యాయవాదుల బైక్ ర్యాలీ





పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 27:-రాయలసీమ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంతో పాటు డివిజన్ కేంద్రమైన పత్తికొండలో సబ్‌కోర్టును ఏర్పాటు చేయాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. మధుబాబు డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం గురువారం పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు ఆధ్వర్యంలో స్థానిక అతిథి గృహం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ.. 2014లో జరిగిన శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హోసూరు పర్యటన సందర్భంగా 90 రోజుల్లో కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల ప్రజలు సుదూర ప్రాంతంలో ఉన్న హైకోర్టుకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. లేకుంటే రాయలసీమ జేఏసీ పిలుపు మేరకు వివిధ దశల్లో నిరసనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.అదేవిధంగా పత్తికొండ డివిజన్ కేంద్రంలో ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలు ఉన్నప్పటికీ సబ్‌కోర్టు లేకపోవడంతో న్యాయవాదులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.న్యాయవాదులు మల్లికార్జున, రవిప్రకాష్, నారాయణస్వామి, సురాజ్‌నబి, రంగస్వామి, రవి, జగదీష్, నెట్టేకల్లు, నరసింహులు, వాసు, సుధాకృష్ణ, భాస్కర్, రాజశేఖర్, అలీ, వీరేష్, మధు, నాగరాజు, నాగభూషణం, శ్రీను, రామంజి, బషీర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

# వేరుశనగ విత్తనాల అక్రమ విక్రయాలపై విచారణ జరపాలి

**3 వేల క్వింటాళ్లు అక్రమంగా అమ్మారని ఆరోపణ**

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..!**

**ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య**



పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 27:-కర్నూలు జిల్లాలో రైతులకు 100 శాతం సబ్సిడీపై ఉచితంగా పంపిణీ చేయాల్సిన విశిష్ట వేరుశనగ కాయలు (విత్తనాలు) సుమారు 3 వేల క్వింటాళ్లను వ్యవసాయ శాఖ అధికారులు అక్రమంగా విక్రయించి, రూ.30 కోట్లకు పైగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు.గురువారం పత్తికొండలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలి వద్ద సభ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రయ్య మాట్లాడుతూ, రైతులకు పూర్తిగా ఉచితంగా అందించాల్సిన వేరుశనగ విత్తనాలను జిల్లాలో సక్రమంగా పంపిణీ చేయకుండా కొందరు అధికారులు అక్రమంగా విక్రయించారని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం 2025 ఖరీఫ్, రబీ సీజన్లతో పాటు 2026 ఖరీఫ్ సీజన్‌కు రైతుల కోసం 100 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను సరఫరా చేసిందని తెలిపారు. అయితే వాటి పంపిణీపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు తగిన సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై విత్తనాలను అక్రమంగా విక్రయించారని ఆరోపించారు.ఆదోని, ఆలూరు, ఆస్పరి, దేవనకొండ, గూడూరు, హాలహర్వి, హొళగుంద, కోసిగి, కృష్ణగిరి, మద్దికెర, మంత్రాలయం, పత్తికొండ, పెద్దకడుబూరు, తుగ్గలి, వెల్దుర్తి, ఎమ్మిగనూరు తదితర మండలాల్లో ఈ అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. సుమారు 3 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందకుండా పోయాయని, వాటి విలువ రూ.30 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొన్నారు.ఇంత పెద్ద మొత్తంలో అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. గ్రామస్థాయిలో నామమాత్రపు విచారణలు నిర్వహిస్తూ రైతులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు.వెంటనే సమగ్ర విచారణ చేపట్టి అక్రమంగా విక్రయించిన విత్తనాల సొమ్మును రికవరీ చేయాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన వ్యవసాయ శాఖ అధికారులను సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని కోరారు.ధర్నాకు రైతు సంఘం పత్తికొండ నియోజకవర్గ సమితి కార్యదర్శి బి. సురేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. తిమ్మయ్య, రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు ఎం. కారన్న, సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, పట్టణ కార్యదర్శి ఎన్. రామాంజినేయులు, తాలూకా సీనియర్ నాయకుడు ఆర్. గురుదాసు, మండల సహాయ కార్యదర్శి జె. కాశీం, యువజన సమాఖ్య నాయకుడు ఉపేంద్ర, సీపీఐ పట్టణ నాయకులు ఎం.కె. సుంకన్న, ఎం. శ్రీనివాసులు, నాగేంద్ర, జి. బాషా, మాదన్న, లక్ష్మన్న, ఉరుకుందు, వీరేష్‌లు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీతహసీల్దార్‌శ్రీదేవికివినతిపత్రం సమర్పించారు.


# కార్పొరేట్ సంస్థలతో స్థానిక వ్యాపారులకు నష్టం..!

**స్థానిక వ్యాపారులను ప్రోత్సహిస్తేనే ప్రొద్దుటూరు ఆర్థికంగా బలోపేతం: మాజీ ఎమ్మెల్యే రాచమల్లు**



ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 27:-ప్రొద్దుటూరు పట్టణం ఏర్పడిన నాటి నుంచి గొప్ప వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిందని, వస్త్ర, బంగారు, కాటన్, ఆయిల్ తదితర వ్యాపార రంగాల్లో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక దొరసానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలంగా ప్రొద్దుటూరులో అన్ని రకాల స్థానిక వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలు, షాపింగ్ మాల్స్ రావడం వల్ల స్థానిక వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ముఖ్యంగా పండుగల సమయంలో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపార సంస్థలు వచ్చి ఆకర్షణీయమైన ఆఫర్లు ఇవ్వడం వల్ల స్థానిక వ్యాపారులకు వ్యాపారం తగ్గిపోతోందని తెలిపారు. స్థానిక వ్యాపారులు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు, ప్రజలకు అరువు, గ్యారంటీ, రీప్లేస్‌మెంట్ వంటి సదుపాయాలు కల్పిస్తూ ఎన్నో ఏళ్ళుగా వినియోగదారులకు అండగా నిలుస్తున్నారని రాచమల్లు పేర్కొన్నారు.అలాంటి వ్యాపారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తాను కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకమని స్పష్టం చేసిన రాచమల్లు, ప్రొద్దుటూరులోని కొన్ని షాపింగ్ మాల్స్ ప్రారంభ సమయంలో మంచి స్టాక్, ఆకర్షణీయమైన ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకున్నప్పటికీ, ప్రస్తుతం డెడ్ స్టాక్‌ను విక్రయిస్తున్నారనే అభిప్రాయాలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు. వ్యాపారం తగ్గితే సిబ్బందిని తగ్గించే పరిస్థితి వస్తుందని, చివరికి నష్టపోయేది స్థానికులేనని వ్యాఖ్యానించారు.ప్రొద్దుటూరులో చందనాస్ వంటి కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు కావడం వల్ల స్థానిక బంగారు వ్యాపారులు, స్వర్ణకారులు, కార్మికులపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. పట్టణంలో బంగారు వ్యాపారంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 నుంచి 6 వేల మంది జీవనం సాగిస్తున్నారని తెలిపారు. స్థానిక బంగారు వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లో వస్తువులు అందించడంతో పాటు, అరువు, రీప్లేస్‌మెంట్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు.అదే విధంగా నాయీబ్రాహ్మణులు ఎన్నో ఏళ్ళుగా తమ వృత్తిని నమ్ముకుని ఆధునిక సౌకర్యాలతో షాపులను ఏర్పాటు చేసుకుంటున్నారని, బయట ప్రాంతాల నుంచి వచ్చే కార్పొరేట్ సంస్థలు స్థానికుల వృత్తి, ఉపాధిపై ప్రభావం చూపే అంశాన్ని కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో ఎలక్ట్రికల్, స్టీల్ సామాన్ల రంగంలో కూడా కార్పొరేట్ సంస్థలు ప్రొద్దుటూరులో ఏర్పాటు కానున్నట్లు సమాచారం ఉందని రాచమల్లు తెలిపారు. స్థానిక వ్యాపారులను ప్రజలు, ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. "కార్పొరేట్ సంస్థలు ఇక్కడి ప్రజల డబ్బుతో వ్యాపారం చేసి ఆ ఆదాయాన్ని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తాయి. స్థానిక వ్యాపారులను ప్రోత్సహిస్తే ప్రొద్దుటూరు ఆర్థికంగా బలోపేతం అవుతుంది. కార్పొరేట్ సంస్థలను విచ్చలవిడిగా ప్రోత్సహిస్తే ఆర్థిక వలస విధానాన్ని ప్రోత్సహించినట్లే" అని ఆయన వ్యాఖ్యానించారు. డీమార్ట్ వంటి సంస్థలతో పోలిస్తే స్థానిక వ్యాపారులు కూడా అనేక వస్తువులను సమాన ధరలకు విక్రయిస్తున్నారని, ప్రజలు స్థానిక వ్యాపారుల నుంచి కొనుగోళ్లు చేయడం ద్వారా పట్టణ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇచ్చినవారవుతారని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు.

## సిద్ధవటం రెవెన్యూ కార్యాలయానికి ఉచితంగా ప్రింటర్ వితరణ



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 27:**-మండల కేంద్రమైన సిద్ధవటం ప్రభుత్వ రెవెన్యూ కార్యాలయానికి రూ.20 వేల విలువైన కంప్యూటర్ ప్రింటర్‌ను ఎన్నారై జయరామయ్య ఉచితంగా వితరణ చేశారు. గురువారం రెవెన్యూ కార్యాలయం సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జయరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు అవసరమైన పరికరాలు, ఇతర సౌకర్యాల విషయంలో ప్రజా ప్రతినిధులు, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ప్రభుత్వ సేవలు మరింత సమర్ధవంతంగా ప్రజలకు అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

## ఖాళీగా ఉన్న ఇళ్లపై రీ సర్వే పూర్తి చేయాలి



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 27:**-మండల కేంద్రమైన సిద్ధవటం రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఇళ్ల గణన రీ సర్వేపై ఎన్యుమరేటర్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మూడు నెలల క్రితం హౌస్ రిజిస్ట్రేషన్ ఆపరేషన్‌లో చేపట్టిన ఇళ్ల గణనలో సుమారు 2,200 ఇళ్లు ఖాళీగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఇళ్ల యజమానులు ప్రస్తుతం ఏ రాష్ట్రంలో, ఏ గ్రామంలో, ఏ మండలంలో నివసిస్తున్నారో ఎన్యుమరేటర్లు వివరాలు సేకరించి రీ సర్వే చేయాలని సూచించారు. ఖాళీ ఇళ్లకు సంబంధించిన రీ సర్వే ప్రక్రియను సెప్టెంబర్ 15లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ కాలువ పూడ్చివేతతో మురుగునీరు స్తంభింపు



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 27:**-కడపచెన్నై జాతీయ రహదారిపై సిద్ధవటం మండలం మాధవరం1 గ్రామ సమీపంలో డ్రైనేజీ కాలువ పూడ్చివేయడంతో మురుగునీరు స్తంభించి దుర్వాసన వెదజల్లుతోంది. జాతీయ రహదారి పక్కన దుకాణదారులు కొంతమేర కాలువను పూడ్చివేయడంతో మురుగునీరు వెళ్లేందుకు మార్గం లేకపోయిందని స్థానికులు తెలిపారు. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసనతో పాటు దోమల బెడద నెలకొందని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్ మాట్లాడుతూ.. కాలువ పూడ్చివేత కారణంగానే డ్రైనేజీ స్తంభించిందని తెలిపారు. సంబంధిత దుకాణదారులకు నోటీసులు జారీ చేసి ఆక్రమణలను తొలగించడంతో పాటు స్తంభించిన డ్రైనేజీని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు.

## లింగాలలో వైఎస్ అవినాష్ జన్మదిన వేడుకలు

**లింగాల మన జనప్రగతి ఆగస్టు 27:**-మండల పరిధిలోని గ్రామాల్లోని వైకాపా కార్యకర్తలు నాయకులు గురువారం కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి 42వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన లింగాలలోని గ్రంథాలయం కాంపౌండ్ లోఉన్నటువంటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి అనంతరం కడప ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా భారీ కేకునుకట్ చేసి కార్యకర్తలు పంపిణీ చేసుకున్నారు. అలాగే అభినందనలు కూడా తెలుపుకున్నారు. మండల పరిధిలోని వైకాపా నాయకులతో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే 'ఇంటింటికి టీడీపీ' లక్ష్యం



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 27:** ప్రజా సమస్యలే అజెండాగా తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికి టీడీపీ' కార్యక్రమాన్ని సిద్ధవటం మండలంలోని ఎగువపేట గ్రామంలో గురువారం నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే తమ ఆకాంక్ష అని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలు, పాత్రికేయులు, సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు జరిగాయని ఆరోపించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, రాజకీయాల్లో సంయమనం పాటించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి రాజానాయుడు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు పార్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైయస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు






**కడప మన జనప్రగతి ఆగస్టు 27:**-కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను, వైయస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకుని నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా అన్నారు.కడప నగరంలోని జడ్పీ సమీపంలో అన్నా క్యాంటీన్ ఎదురుగా యువ నాయకుడు రహీం ఆధ్వర్యంలో అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా పాలాభిషేకం, కేక్ కటింగ్, అన్నదానం నిర్వహించారు.అలాగే డిప్యూటీ సీఎం కార్యాలయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్, వైసీపీ కార్యాలయంలో ఎన్నారై బీహెచ్ ఇలియాస్ ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాల్గొని అవినాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల పట్ల అండగా ఉంటూ కడప జిల్లా అభివృద్ధికి అవినాష్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, భవిష్యత్తులో అంచలంచెలుగా ఉన్నత పదవులు అధిరోహించి రాష్ట్రానికి, పేద ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.కార్యక్రమాల్లో మాజీ మేయర్ పాక సురేష్, పులి వెంకటసుబ్బమ్మ, మాస్సిమ బాబు, మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, పులి సునీల్, తోట కృష్ణ, దాసరి శివ, షఫీ, బాబు, త్యాగరాజు, కంచుపాటి బాబు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'మెడికవర్'లో హైరిస్క్ గర్భిణికి విజయవంతమైన చికిత్స




**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 27:**-మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడలోని స్త్రీ, శిశు విభాగం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకుంది.ఈ సందర్భంగా హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక వైద్య పర్యవేక్షణతో పాటు, ప్రీటర్మ్ శిశువులకు అత్యాధునిక ఎన్‌ఐసియు సేవలు అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఇటీవల 7.5 నెలల గర్భధారణతో హైరిస్క్ పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చిన గర్భిణిని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ ప్రవీణ బి ఆధ్వర్యంలో వైద్య బృందం నిరంతరం పర్యవేక్షించింది.తల్లి, గర్భంలోని శిశువు ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి, సరైన సమయంలో ప్రసవం నిర్వహించారు. దీంతో ప్రీమేచ్యూర్ బేబీ జన్మించింది.పుట్టిన వెంటనే శిశువు పరిస్థితి విషమంగా ఉండటంతో ఎన్‌ఐసియులో చేర్చి ప్రముఖ పీడియాట్రిషియన్ వి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక చికిత్స అందించారు. అవసరమైన వెంటిలేటర్ సపోర్ట్, ఇతర అత్యవసర వైద్య విధానాలను వినియోగిస్తూ శిశువును నిరంతరం పర్యవేక్షించారు. శ్వాస, ఆక్సిజన్ స్థాయిలు, హృదయ స్పందనను గమనించినట్లు వైద్యు లు గురువారం మెడికవర్ ఆసుపత్రిలో తెలిపారు.చికిత్సకు శిశువు క్రమంగా స్పందించడంతో 15 రోజుల అనంతరం తల్లి, బిడ్డలను ఆరోగ్యకరమైన స్థితిలో డిశ్చార్జ్ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ప్రవీణ మాట్లాడుతూ హైరిస్క్ గర్భధారణలో ప్రతి మహిళ పరిస్థితి భిన్నంగా ఉంటుందని, ముఖ్యంగా ప్రీటర్మ్ డెలివరీ అవకాశాలున్నప్పుడు తల్లి, శిశువు ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించడం కీలకమన్నారు.డాక్టర్ వి సుబ్బారావు మాట్లాడుతూ ప్రీమేచ్యూర్ శిశువుల్లో పుట్టిన వెంటనే శ్వాస సంబంధిత సమస్యలు, ఆక్సిజన్ స్థాయిల్లో మార్పులు తదితర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని. ఈ శిశువు పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే ప్రత్యేక పర్యవేక్షణ ప్రారంభించి అవసరమైన వైద్య సహాయం అందించామని తెలిపారు. స్త్రీ, శిశు విభాగం ఏడాది పూర్తి చేసుకోవడం సంతోషకరమని ప్రముఖ గైనకాలజిస్టులు కస్తూరిబాయి వెలగ, సుజన నిమ్మకాయల, శ్రావణి సాక్షిలు పేర్కొన్నారు. ప్రీమేచ్యూర్, హైరిస్క్ శిశువులకు నిరంతర పర్యవేక్షణ, సకాలంలో వైద్య సేవలు ఎంతో కీలకమని ప్రముఖ పీడియాట్రిషియన్ డాక్టర్ రవి అంగర అన్నారు.మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ నందికోళ్ల ఆంజనేయస్వామి (అంజిబాబు) మాట్లాడుతూ స్త్రీ, శిశు విభాగం ఏడాది పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. హైరిస్క్ గర్భధారణలు, ప్రీటర్మ్ డెలివరీలు, నవజాత శిశువులకు ప్రత్యేక వైద్య సంరక్షణను ఒకే చోట అందించేలా సేవలను అభివృద్ధి చేశామని, కాకినాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల అవగాహన




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 27:**-రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు సూచించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్. ఆదేశాల మేరకు ప్రొద్దుటూరులోని అనిబిసెంట్ మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొద్దుటూరు ట్రాఫిక్ సి.ఐ. భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రహదారి భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సి.ఐ. భాస్కర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని తెలిపారు.రహదారిపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వాహనాల వేగాన్ని నియంత్రించడం, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించడం వంటి జాగ్రత్తలను వివరించారు. రోడ్డు దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్‌ను మాత్రమే వినియోగించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రహదారిపై వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.అదేవిధంగా మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం ప్రమాదకరమే కాకుండా చట్టవిరుద్ధమని సి.ఐ.భాస్కర్ హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమకు కల్పించిన అవగాహనను కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసి రోడ్డు భద్రతపై చైతన్యం తీసుకురావాలని కోరారు."నిబంధనలు పాటిద్దాం..ప్రమాదాలను నివారిద్దాం..విలువైన ప్రాణాలను కాపాడుకుందాం" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ట్రాఫిక్ పోలీసులు పిలుపునిచ్చారు.

## దళితుల హక్కుల సాధనకై పోరాటమే ఎండిపిఎస్ లక్ష్యం

- మాదిగల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం
- ఎండిపిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సి.వి.రమణ




**కడప మన జనప్రగతి ఆగస్టు 27:**-దళితుల హక్కుల సాధన కోసం మాదిగ దళ పోరాట సమితి (ఎండిపిఎస్) ఎంతవరకైనా పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సి.వి. రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎద్దులపల్లి చెన్నకేశవులు తెలిపారు.మాదిగ దళ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దపల్లి శేఖర్ ఆదేశాల మేరకు గురువారం వైఎస్ఆర్ కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడప జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న అస్పృశ్యత, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు తమ సంఘం కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో పాటు దళితులు, బలహీన వర్గాలకు అందాల్సిన మౌలిక సదుపాయాల కోసం పోరాడుతామని చెప్పారు.దళితుల కోసం స్మశాన వాటికలు, భూ సమస్యలు, ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు. రాజకీయ నాయకులు దళితులు, బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని, రాజకీయ అధికారంలో వారికి సముచిత భాగస్వామ్యం కల్పించేందుకు అవసరమైన స్థాయిలో కృషి జరగడం లేదని విమర్శించారు.స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ, ఎస్సీ, ఎస్టీ చట్టాలు అమల్లో ఉన్నా దళితులపై దాడులు, హింసాత్మక ఘటనలు కొనసాగడం ఆందోళనకరమన్నారు. దళితుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. త్వరలో మాదిగ దళ పోరాట సమితి ఆవిర్భావ సభ నిర్వహించనున్నామని, ఈ సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై మద్దతు తెలపాలని కోరారు.అనంతరం కడప జిల్లాకు పూర్తిస్థాయి జిల్లా కమిటీని నియమించడంతో పాటు జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాలకు కమిటీ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుండుపల్లి ఓబులేసు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్, రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులు, కడప జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా కోఆర్డినేటర్ ఆంజనేయులు, వెంకటేశు, బద్వేల్‌కు చెందిన మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## తెగిన పెనగలూరు చెరువు కట్టకు మరమ్మతులు చేయాలి

**- సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్**



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 27:** ఐదు సంవత్సరాల క్రితం అన్నమయ్య డ్యాం కొట్టుకుపోవడంతో ఆ వరద నీటి ప్రవాహంతో పెనగలూరు మండలంలో చెరువు కట్ట తెగిపోవడంతో, 1400 ఎకరాలు పంటలు సాగు లేకుండా బీడు పెట్టాల్సి వస్తోందని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు.గురువారం వరదల్లో కొట్టుకుపోయిన, చెరువు కట్టను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరం అయినా, ఆ చెరువు కట్టకు పడిన గండి పూడ్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు నీరు వదిలే గేటు తూములు కూడా, శిథిలావస్థకు చేరుకొని పాడు పడ్డాయి అన్నారు. కట్టమీద ప్రయాణించే, 10 గ్రామాలు ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు అన్నారు. చెరువులో నీరు నిలువ లేకుండా పోవడంతో, చెరువు ఆక్రమణ గురై భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రెండు పంటలు పండే చెరువు పైన వైసీపీ ప్రభుత్వం గాని, నేడు టిడిపి కూటమి ప్రభుత్వం, కానీ రైతుల పైన ఎంత శ్రద్ధ ఉందో దీన్ని బట్టి తెలుస్తుందని ఆరోపించారు. చెరువు మరమ్మతుల ఖర్చుల కోసం ఇరిగేషన్ అధికారులు వేసిన 8 కోట్ల రూపాయల ఎస్టిమేషన్లు సెక్రటేరియట్, సీఈ కార్యాలయంలో ఉన్నాయని, వీటిని గురించి పట్టించుకోలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పెనగలూరు చెరువు రిపేరు కోసం, నిధులు కేటాయింపు కోసం, రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు రైతులు. ఎన్. జయరామయ్య నాయుడు, కే. కృష్ణయ్య, సిరివరం పెద్ద నరసింహులు, ఏ. కృష్ణమ నాయుడు పాల్గొన్నారు.

# ఓబులేసు,కోడూరు సతీష్ మృతి కేసులో వీడిన మిస్టరీ

**● హత్య కాదు..ప్రమాదవశాత్తు కాలువలో మునిగే మృతి: ఏఎస్పీ విభూ కృష్ణ**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 27:**-బి.మఠం పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం రేపిన క్రైమ్ నంబర్ 14/2026 కేసులో ఓబులేసు,కోడూరు సతీష్‌ల మృతి వెనుక అసలు కారణాలను పోలీసులు వెల్లడించారు. ఇది హత్య కాదని, ఇద్దరూ ప్రమాదవశాత్తు కాలువలో మునిగిపోవడం వల్లే మృతి చెందినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయిందని ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూ కృష్ణ స్పష్టం చేశారు. మృతుల కుటుంబ సభ్యుల అనుమానాలు, వినతులు, మాదిగ దండోరా నాయకుల ఆధ్వర్యంలో జరిగిన సుదీర్ఘ ఆందోళనల నేపథ్యంలో కేసును అన్ని కోణాల్లో లోతుగా దర్యాప్తు చేసినట్లు తెలిపారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలను వివరించారు.ఫిబ్రవరి 5న జరిగిన ఈ ఘటనపై పోలీసులు సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, సీసీటీవీ ఫుటేజ్, పోస్టుమార్టం నివేదికలు, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ డేటాతో పాటు జలవనరుల శాఖ అందించిన సాంకేతిక నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. **దర్యాప్తులో కీలక ఆధారాలు..** మృతులిద్దరూ కాలువలోకి దిగే ముందు కలిసి ఉన్నట్లు ప్రత్యక్ష సాక్ష్యాలు నిర్ధారించాయని, ఈ ఘటనను సంతోష్ అనే వ్యక్తి ప్రత్యక్షంగా చూసినట్లు అధికారులు తెలిపారు. అలాగే బాధితులు నీటిలో ఉన్న సమయానికి సంబంధించిన థంబ్‌నెయిల్స్ డిజిటల్ ఫోరెన్సిక్ పరీక్షల్లో లభించినట్లు వెల్లడించారు. పోస్టుమార్టం నివేదికల్లోనూ ఇద్దరూ మరణానికి ముందే నీటిలో మునిగిపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయినట్లు స్పష్టమైనట్లు తెలిపారు.కాలువలో నీటి ప్రవాహ వేగాన్ని జలవనరుల శాఖ అధికారులు సాంకేతికంగా విశ్లేషించగా, ఓబులేసు మృతదేహం నీటి ప్రవాహంలో దిగువకు కొట్టుకుపోవడం సాధ్యమేనని నివేదికలో పేర్కొన్నట్లు ఏఎస్పీ వివరించారు. సేకరించిన వైద్య, సాంకేతిక, డిజిటల్ ఆధారాలన్నీ పరస్పరం సరిపోలుతున్నాయని, కేసులో హత్య లేదా కుట్రకు సంబంధించిన ఆధారాలు ఏవీ లభించలేదని పోలీసులు స్పష్టం చేశారు. సమగ్ర దర్యాప్తు అనంతరం ఓబులేసు, కోడూరు సతీష్‌లు ప్రమాదవశాత్తు కాలువలో మునిగిపోవడం వల్లే మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చినట్లు ఏఎస్పీ విభూ కృష్ణ తెలిపారు.

# ఉంతకల్‌లో ఘనంగా మిలాద్-ఉన్-నబి పర్వదిన వేడుకలు

**● ప్రత్యేక ప్రార్థనలు జెండాలతో ఊరేగింపు..**



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 27:**-మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని బొమ్మనహాల్ మండల పరిధిలో ఉంతకల్ గ్రామంలో మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు,స్థానిక ముస్లిం సోదరులు భారీగా జెండాలతో ఊరేగింపు నిర్వహించారు,గ్రామాలలో పురవీధుల్లో సాగిన ఊరేగింపులో ముస్లిం మత పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు,ఈ సందర్భంగా ప్రజలు ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి,పలువురు మత పెద్దలు జెండాలకు పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, అనంతరం గ్రామ పెద్దలు మరియు మత పెద్దలు ప్రజలు పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు,జెండా ఊరేగింపు సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మండల సబ్ ఇన్స్పెక్టర్ నబిరసుల్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు,మత సామరస్యాన్ని చాటేలా మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి,ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ముస్లిం మత పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల మధ్య ఉంటూ..ప్రజల కోసం పనిచేయడమే అవినాష్‌రెడ్డి ప్రత్యేకత

**● వేముల మండల వైకాపా కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి**

**● వేములలో ఘనంగా వైఎస్ అవినాష్‌రెడ్డి 42వ జన్మదిన వేడుకలు**

**● కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన వైకాపా నాయకులు,కార్యకర్తలు**




**వేముల మన జనప్రగతి ఆగస్టు 27:**-నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి రాజకీయ ప్రస్థానానికి ప్రత్యేకత అని వేముల మండల వైకాపా కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి,జడ్పీటీసీ కొకటం వెంకటబయపురెడ్డి,ఎంపీపీ భర్త చల్లా వెంకట నారాయణ,పిసిబి సభ్యులు మరక శివకృష్ణ రెడ్డిలు పేర్కొన్నారు.వేముల మండల కేంద్రంలోని స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి 42వ జన్మదిన వేడుకలను వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య వారు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అవినాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాగేళ్ల సాంబశివారెడ్డి మాట్లాడుతూ...వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం,అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అదే స్ఫూర్తితో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కడప పార్లమెంటు పరిధిలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.కడప జిల్లాకు రైల్వే ప్రాజెక్టులు తీసుకురావడంలో అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారని, కడపబెంగళూరు రైల్వే మార్గం పనుల పురోగతిని పార్లమెంటులో ప్రస్తావించారని అన్నారు. జిల్లాలో రైతుల సాగునీటి సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పులివెందుల ప్రాంతంలో తాగునీరు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు.నియోజకవర్గంలో రహదారులు, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు,ప్రభుత్వ వైద్య సేవలు, ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు సహకరించారని తెలిపారు.రైతులు, మహిళలు, యువతకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు.నియోజకవర్గానికి కేంద్ర నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు మంజూరు చేయించేందుకు ఎంపీగా నిరంతరం ప్రయత్నిస్తున్నారని సాంబశివారెడ్డి తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న అవినాష్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వైకాపా నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లాలో ఖరీఫ్ 2026-27 ధాన్యం సేకరణకు ముందస్తు ఏర్పాట్లు

**● జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు27:**-జిల్లాలో ఖరీఫ్ 2026-27 సీజన్‌లో రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వ మద్దతుధరకు పారదర్శకంగా సేకరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు.గురువారం కాకినాడ కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాల శాఖ, వ్యవసాయం, రవాణా, సహకార, లీగల్ మెట్రాలజీ, ఎఫ్‌సీఐ తదితర శాఖల అధికారులతో కలిసి ఖరీఫ్ 2026-27 సీజన్ ధాన్యం సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్ లో ధాన్యం సేకరణ సక్రమంగా నిర్వహించేందుకు పౌరసరఫరాలు, వ్యవసాయం, సహకార, ట్రాన్స్పోర్ట్, తూనికలు కొలతలు తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, క్షేత్రస్థాయిలో తగిన ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 70.012 హెక్టార్లలో సాగు చేస్తుండగా ఇప్పటివరకు 50,824 హెక్టార్లలో క్రాప్ బుకింగ్ పూర్తైయిందని జేసి తెలిపారు. జిల్లాలో 271 రైతు సేవ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని పరిశీలించేందుకుఅవసరమైన యంత్రాలను అందుబాటు లో ఉంచాలని సూచించారు.రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా రవాణా ఏర్పాట్లు సజావుగా సాగేలా చూడాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.రైసు మిల్లుల పరిధిలో ఉన్న వే బ్రిడ్జులను తూనికల్లో మోసాలకు తావులేకుండా లీగల్ మెట్రాలజీ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. రైతులు పండించిన ధాన్యానికి తప్పనిసరిగా రైతులు కనీస మద్దతు ధరకు విక్రయించుకునేలా ఇప్పటినుంచే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధరపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రైతులు విక్రయించిన ధాన్యానికి సకాలంలో బిల్లులు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ అపూర్వ భరత్ తెలిపారు.ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం ఆనందరావు, డీఎస్ఓ టి ప్రసన్న లక్ష్మిదేవి, వ్యవసాయం, రవాణా, సహకార,లీగల్ మెట్రాలజీ, ఎఫ్‌సీఐ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కారుతో సహా రూ.౯ లక్షల విలువైన 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



**భాకరాపేట మన జనప్రగతి ఆగస్టు 27:**-భాకరాపేట అటవీశాఖ అధికారులు నిర్వహించిన దాడిలో కారుతో పాటు రూ.9 లక్షల విలువైన 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన నిందితుల కోసం అటవీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి వి. సాయిబాబా ఆదేశాల మేరకు భాకరాపేట రేంజ్ అటవీక్షేత్రాధికారి ఎన్. వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. కళ్యాణి డ్యామ్ పరిసర ప్రాంతాల నుంచి ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం అందడంతో రేంజ్ సిబ్బంది, బేస్ క్యాంపు సిబ్బంది, స్ట్రైక్ ఫోర్స్, ప్రొటెక్షన్ వాచర్లతో కలిసి నాగపట్ల ఈస్ట్ బీట్‌లోని కళ్యాణి డ్యామ్ ఫిల్టర్ హౌస్ వద్దకు చేరుకున్నారు.గురువారం తెల్లవారుజామున కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తుండగా అటవీ సిబ్బంది గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా నిందితులు కారును, ఎర్రచందనం దుంగలను అక్కడే వదిలి ముళ్ల పొదల్లోకి పారిపోయారు. అధికారులు కారును తనిఖీ చేయగా అందులో 15 ఎర్రచందనం దుంగలు, మొత్తం 326 కిలోల బరువు ఉన్నట్లు గుర్తించారు.స్వాధీనం చేసుకున్న కారు, ఎర్రచందనం దుంగల మొత్తం విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అటవీ అధికారులు అంచనా వేశారు. పరారైన నిందితులను పట్టుకునేందుకు గాలింపు కొనసాగుతోందని భాకరాపేట రేంజ్ అటవీక్షేత్రాధికారి ఎన్. వెంకటరమణ తెలిపారు.ఈ దాడిలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆర్.ఎస్. చైతన్య, ఎఫ్‌బీఓ సి. రవి, డ్రైవర్లు టి. ప్రభుతేజ, హెచ్. శంకర్, ఎన్. రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు ఈ. సురేంద్ర, ఎం. కేశవులు, ఎం. హేమచంద్ర, వై. యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ నిర్వహణ కమిటీ ఏర్పాటు



**విడపనకల్ మన జనప్రగతి ఆగస్టు 27:**-అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల నాణ్యతను మెరుగుపరచడం, పారదర్శకతను పెంచడం, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా స్థానిక మహిళల భాగస్వామ్యంతో అంగన్‌వాడీ నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేశారు.కమిటీలో మొత్తం ఏడుగురు మహిళలు సభ్యులుగా ఉంటారు. సమగ్ర శిశు అభివృద్ధి సేవల పర్యవేక్షకురాలు అధ్యక్షురాలిగా, అంగన్‌వాడీ కార్యకర్త సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఆశా కార్యకర్త, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల తల్లులు ఇద్దరు, స్వయం సహాయక సంఘం సభ్యురాలు, స్థానిక మహిళా ఉపాధ్యాయురాలు సభ్యులుగా ఉంటారు. పిల్లల తల్లుల ఎంపికలో పదో తరగతి చదివిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.ప్రతి రెండు నెలలకు ఒకసారి కమిటీ సమావేశం నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రంలోని భోజనం నాణ్యత, పరిశుభ్రత, భవనం పరిస్థితి, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించనున్నారు. పిల్లల ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడంతో పాటు పోషకాహార లోపం ఉన్న పిల్లలను అవసరమైనప్పుడు ఆరోగ్య కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటారు.తల్లిదండ్రులకు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన కల్పించడంతో పాటు పోషణ్ మాసం, గ్రామ ఆరోగ్య పరిశుభ్రతపోషణ దినోత్సవాలు, తిథి భోజనం, పోషణ వాటిక వంటి కార్యక్రమాల్లో కమిటీ భాగస్వామ్యం కానుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన ఆట వస్తువులు, విద్యా సామగ్రిని ప్రజలు, దాతలు, స్థానిక సంస్థల సహకారంతో సమీకరించేందుకు కృషి చేయనున్నారు.ప్రజలు, తల్లిదండ్రులు తెలియజేసే సమస్యలను పరిశీలించి సాధ్యమైన పరిష్కారాలను సూచించడం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలపై సామాజిక పర్యవేక్షణను మరింత బలోపేతం చేయనున్నారు. ఈ కమిటీల ఏర్పాటుతో పిల్లలకు అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు, పరిశుభ్రత, విద్యా కార్యక్రమాల్లో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని అధికారులు తెలిపారు.

# నేత్రదానంపై మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల భారీ ర్యాలీ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 27:** జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పులివెందులలో నేత్రదాన అవగాహన ర్యాలీ, మానవహారం కార్యక్రమాన్నిప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (ఎన్ఎస్ఎస్),డాక్టర్ అగర్వాల్ నేత్రనిధి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి,వైస్ ప్రిన్సిపల్ శ్రీనిత,సేవాసమితి అధ్యక్షుడు రాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపునివ్వవచ్చని, ప్రజలు అపోహలను వీడి నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పట్టణ ప్రధాన వీధుల్లో నినాదాలతో సాగిన ర్యాలీ పూల అంగళ్ల కూడలిలో మానవహారం చేపట్టి నేత్రదాన ప్రతిజ్ఞ చేసిన విద్యార్థినులు,అధ్యాపకులు.

# ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తకు ఘన స్వాగతం



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 27:**-ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా నియమితులైన జస్టిస్ టి.మల్లికార్జున రావుకు కర్నూలులో ఘన స్వాగతం లభించింది. గురువారం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మర్యాదపూర్వకంగా లోకాయుక్తను కలిసి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా పరంగా లోకాయుక్తకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని అధికారులు తెలిపారు. జిల్లాలో లోకాయుక్తకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు.

# 29న రేడియో స్టేషన్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాస మహోత్సవాలు




**కడప మన జనప్రగతి ఆగస్టు 27:**-కడప పులివెందుల ప్రధాన రహదారి లో చింతకొమ్మదిన్నె మండలం శివాజీ నగర్ రేడియో టేషన్ ప్రక్కన వెలసిన శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మూడో శనివారం 29వ తేదీన శ్రావణమాస మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు, ఉదయం ఆంజనేయ స్వామి మూల విరాట్ కు అభిషేక పూజలు అలంకరణ నిర్వహిస్తున్నారు, మధ్యాహ్నం 12 గంటలకు యోగి వేమన విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ సిబ్బంది చే అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు,

## రాయల్ జ్యువెలర్స్ షోరూమ్ ప్రారంభం




**కడప మన జనప్రగతి ఆగస్టు 27:**–కడప నగరంలోని బి.కె.ఎం. స్ట్రీట్‌లోని జె.సి. కాంప్లెక్స్‌లో సయ్యద్ పీర్ భాషా ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాయల్ జ్యువెలర్స్ షోరూమ్ గురువారం ప్రారంభమైంది. షోరూమ్‌ను మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాషా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా షోరూమ్ నిర్వాహకులు పీర్ భాషాకు శుభాకాంక్షలు తెలిపారు. రాయల్ జ్యువెలర్స్ ప్రజల ఆదరణ పొందుతూ వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుభాన్ బాషా, బంగారు రాజా (రాజశేఖర్ రెడ్డి), మాజీ డిప్యూటీ మేయర్ జమాల్ వలి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, జిల్లా కార్యదర్శులు రమేష్ రెడ్డి, చాంద్ బాషా, మాజీ కార్పొరేటర్ మొహమ్మద్ షఫీ, స్థానిక నాయకులు అల్లా బకాష్, ఇస్మాయిల్, సలీం, వ్యాపార ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

## వేంపల్లెలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**- వేంపల్లె ఏఈ మైకేల్ జాక్సన్**

**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 27:**–వేంపల్లి లోని 11 కెవి ఆర్టీసీ పీడర్ లో మెయింటినెన్స్, చెట్ల కొమ్మల తొలగింపు పనుల వల్ల శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వేంపల్లి ట్రాన్స్కో ఇన్చార్జి ఏఈ మైకేల్ జాక్సన్ తెలిపారు.మెయింటినెన్స్ పనుల కారణంగా కడప రోడ్డు,ఎస్సీ కాలనీ,కాపు వీధి,ఆర్టీసీ బస్టాండ్, పోలీస్ స్టేషన్,గవర్నమెంట్ హాస్పిటల్,బాయ్స్ హై స్కూల్,బ్యాంక్ సర్కిల్,చైతన్య స్కూల్ ఏరియా,ఉషా కిరణ్ స్కూల్ ఏరియా,టిటిడి కళ్యాణ మండపం ఏరియా,ఆర్ అండ్ బి బంగ్లా ఏరియా ప్రియా తోట, బూడిది గుంట,గౌరీ టెంపుల్ ఏరియా,పాతపేట ఏరియా,అమ్మవారి శాల ఏరియా, బొడ్డు చావిడి ఏరియా,ఓం శాంతి ఏరియా,బిడాల మిట్ట ఏరియాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంటు ఉండదని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

## మహిళల భద్రతపై అవగాహన సమావేశం



**ఎర్రగుంట్ల మన జనప్రగతి ఆగస్టు 27:**– జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కలమల్ల పోలీస్ స్టేషన్‌లో మహిళల భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డయల్ 112, మహిళా హెల్ప్‌లైన్ 181, సైబర్ మోసాల కోసం 1930, బాలల రక్షణకు 1098 హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, గృహ హింస, మహిళలపై నేరాలు, వ్యక్తిగత భద్రతపై వివరించారు.మహిళలు సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సునీల్ కుమార్ సూచించారు.


## మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి... పోలీసుల అవగాహన



**కడప టౌన్ మన జనప్రగతి ఆగస్టు 27:**– డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని యువతకు జిల్లా పోలీసులు సూచించారు. ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడపలోని శ్రీహరి డిగ్రీ కాలేజీలో పోలీస్ కళా–జాగృతి బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.'ఓ యువతా... మేలుకో' సందేశంతో పాటలు, నాటికలు, కళారూపాల ద్వారా మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ వినియోగం, విక్రయం, రవాణా చట్టరీత్యా నేరమని, అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని పోలీసులు సూచించారు.విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి, లక్ష్యసాధనపై దృష్టి సారించాలని అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి: ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు

- పులివెందులలో పోలీసుల విస్తృత తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘించిన 19 మందికి జరిమానా





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 27:** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పులివెందుల ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలు,డీఎస్పీ బుక్కే మురళి సూచనల మేరకు గురువారం పులివెందుల పట్టణంలో పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.పూల అంగళ్ళ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు,నాలుగు రోడ్ల కూడలిలో టౌన్ ఎస్సై తిమోతి,పాత బస్టాండ్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ ఎస్సై గంగాధరరెడ్డి వాహనాల తనిఖీలు చేపట్టారు.ముఖ్యంగా సాధారణ ప్రజలతో పాటు ప్రభుత్వ,ప్రైవేటు ఉద్యోగులు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ దేశంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోజుకు సగటున 28 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.సమీప ప్రాంతాలకే కదా అని నిర్లక్ష్యం చేయకుండా ఇంటి నుంచి బైక్‌పై బయటకు వచ్చే ప్రతిసారీ హెల్మెట్ పెట్టుకోవడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని,ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్రతి వాహనదారుడు సక్రమమైన ఆర్సీ,డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు.నిబంధనలు పాటించకుండా హెల్మెట్ లేకుండా ప్రయాణించిన 19 మంది వాహనదారులను గుర్తించి వారికి జరిమానా విధించినట్లు అధికారులు వెల్లడించారు.

## శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో పారిశ్రామిక ఆలోచనలు,అంకుర సంస్థలపై అవగాహన




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 27:**–విద్యార్థుల్లో పారిశ్రామిక ఆలోచనా విధానం, సృజనాత్మకత, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు భవిష్యత్‌లో విజయవంతమైన అంకుర సంస్థలను స్థాపించే దిశగా యువతను ప్రోత్సహించేందుకు రాయచోటిలోని శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ స్వయం ప్రతిపత్తి కళాశాల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.'పారిశ్రామికత, అంకుర సంస్థలు అవగాహన, స్ఫూర్తి, ఆవిష్కరణ' అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రొసోల్ మైండ్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఫయాజ్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి, అంకుర సంస్థల ఏర్పాటుకు అవసరమైన అంశాలను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులు కేవలం సంప్రదాయ ఉద్యోగ అవకాశాలపైనే ఆధారపడకుండా తమలోని సృజనాత్మక ఆలోచనలను గుర్తించి వాటిని వ్యాపార అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు. సమాజంలో ఎదురవుతున్న సమస్యలను అవకాశాలుగా భావించి, సాంకేతిక పరిజ్ఞానంతో వినూత్న పరిష్కారాలను అందించడం ద్వారా అంకుర సంస్థల ఆలోచనలకు రూపకల్పన చేయవచ్చని వివరించారు.ఒక సాధారణ ఆలోచనను ప్రాథమిక దశ నుంచి పూర్తి స్థాయి అంకుర సంస్థగా ఎలా అభివృద్ధి చేయాలి, మార్కెట్ అవసరాలను ఎలా అర్థం చేసుకోవాలి, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు, సేవలను ఎలా రూపొందించాలి అనే అంశాలపై విద్యార్థులకు మార్గదర్శకత్వం చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెయ్యి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మంచి ఆలోచనను ఆచరణలోకి తీసుకురావడానికి ప్రణాళిక, పరిశోధన, మార్కెట్ విశ్లేషణ, బృంద నిర్మాణం, పెట్టుబడులు, వ్యాపార నమూనా వంటి అంశాలపై అవగాహన అవసరమన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలను కేవలం తరగతి గది లేదా ప్రాజెక్టు స్థాయికే పరిమితం చేయకుండా వాటికి వాణిజ్య విలువను జోడించి పరిశ్రమలకు ఉపయోగపడే ఉత్పత్తులు, సేవలను అభివృద్ధి చేయాలని సూచించారు.కళాశాల ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ వి. వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో సాంకేతిక నైపుణ్యాలతో పాటు ఆవిష్కరణ, సమస్య పరిష్కార నైపుణ్యాలు అత్యంత కీలకంగా మారాయని తెలిపారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, కొత్తగా ఆలోచించే సామర్థ్యం, సమస్యలను విశ్లేషించి పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా వారు భవిష్యత్‌లో ఏ రంగంలోనైనా విజయవంతంగా రాణించగలరని పేర్కొన్నారు.కళాశాల ప్రాథమిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ ఎన్. నాగేంద్ర మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యసనం, డిజిటల్ సాంకేతికత, స్వయంచాలకీకరణ, సాఫ్ట్‌వేర్, ఆరోగ్య సాంకేతికత, విద్యా సాంకేతికత తదితర అభివృద్ధి చెందుతున్న రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 68 చెరువులకు,గాజుల దిన్నె ప్రాజెక్ట్‌కు నీటిని వదలండి

**- ఎమ్మెల్యేలు గౌరు చరిత,కే.ఈ శ్యాం కుమార్**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 27:**–గాజుల దిన్నె ప్రాజెక్ట్,68 చెరువులకు నీటిని వదలాలని ఎమ్మెల్యేలు గౌరు చరిత, కే.ఈ శ్యాం కుమార్ జిల్లా కలెక్టర్ ను కోరారు.గురువారం పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత,పత్తికొండ శాసనసభ్యులు కే.ఈ. శ్యామ్ కుమార్ జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తాగునీటి అవసరాలపై చర్చించారు. ఈ సందర్భంగా పాణ్యం శాసనసభ్యులు, పత్తికొండ శాసనసభ్యులు మాట్లాడుతూ తమ నియోజకవర్గాల్లో మనుషులకు, పశువులకు తాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు 68 చెరువులను నీటితో నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయని,ప్రజలకు ,పశువులకు త్రాగునీటి సమస్య ఉండదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు కు నీటిని విడుదల చేయాలని కలెక్టర్ ను ఇరువురు ఎమ్మెల్యేలు కోరారు. అలాగే హంద్రీ నది పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి హంద్రీ నదికి నీటిని వదలాలని ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు.జిల్లా కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో తాగునీటికి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యేలకు వివరించారు. 68 చెరువులకు నీటి విడుదల అంశంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని కలెక్టర్ తెలిపారు.సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ శైలేశ్వర్ , హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఎస్ఈ రాజన్ బాబు, పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ నబి రసూల్ పాల్గొన్నారు.

## పులివెందులలో ఘనంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు

- పారిశుద్ధ్య కార్మికులు,దివ్యాంగులకు చీరల పంపిణీ
- పలుచోట్ల అన్నదానం,కేక్ కటింగ్







**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 27:**– కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు,పలు సేవా కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు.ఉదయం నుంచే పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.ఉదయం 08:00 గంటలకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ హఫీజ్ ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించి,కేక్ కట్ చేశారు.స్థానిక వైఎస్ మధు నివాసం వెనుక ఉన్న రజక కాలనీలో పులివెందుల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్థానికులకు అల్పాహారం పంపిణీ చేశారు.చౌడమ్మ గుడి సమీపంలో కోడి రమణ ఆధ్వర్యంలో 42 కేజీల భారీ కేక్ కట్ చేసి,భక్తులకు,ప్రజలకు అల్పాహార వితరణ చేపట్టారు.భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి వైఎస్ మనోహర్ రెడ్డి,వైఎస్ దుష్యంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు.ఎంపీ అవినాష్ రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సమాజ సేవలో ముందుండే పారిశుద్ధ్య మహిళా కార్మికులకు,దివ్యాంగ మహిళలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా నూతన చీరలను పంపిణీ చేశారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు పనిచేస్తున్న ఎంపీ అవినాష్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందని పార్నపల్లి కిషోర్ పేర్కొన్నారు.ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు,మహిళా నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ముచ్చుకోన చెరువుకు కృష్ణా జలాలు ఇప్పించండి

- బీటెక్ రవిని కోరిన తెదేపా నేత షబ్బీర్



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 27:**–ఎలినినో కారణంగా తీవ్రవర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేంపల్లె ప్రాంతంలోని ముచ్చుకోన చెరువుకు కృష్ణాజలాలు అందేలా చూడాలని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్ పులివెందుల టిడిపి ఇన్చార్జి బీటెక్ రవిని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన పులివెందుల తెదేపా కార్యాలయానికి వెళ్లి కరువు పరిస్థితుల కారణంగా ఈ ప్రాంత ప్రజలు తాగునీటికి పడుతున్న ఇబ్బందుల గురించి బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లారు.వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయని, ఇప్పటికే పలుచోట్ల బోర్లు ఎండిపోయి రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుపోయారని షబ్బీర్ పేర్కొన్నారు.ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో వేంపల్లె పరిసర ప్రాంతాల్లో తాగునీటితో పాటు సాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు.ముఖ్యంగా మాలంక, బొగ్గుల వంక, ముచ్చుకోన చెరువులకు కృష్ణా జలాలను విడుదల చేసి, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించాలని షబ్బీర్ బీటెక్ రవిని కోరారు.ప్రజలకు తాగునీరు,రైతులకు సాగునీరు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు బీటెక్ రవి స్పందిస్తూ కరవుతీవ్రతను తీవ్రతను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చిట్ట చివరి ప్రాంతమైన ముచ్చుకోన చెరువుకు కృష్ణా జలాలు అందేలా చూస్తానని బీటెక్ రవి స్పష్టమైన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెదేపా యువ నేతలు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మాంగే) యాసిన్, మూలి గంగాధర్ రెడ్డి, తక్కెళ్ళ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇక్కడకు రావడం వల్ల పాతరోజులు గుర్తుకు వస్తున్నాయి: సినీ నిర్మాత దిల్ రాజు

**పోరుమామిళ్ల మన జనప్రగతి ఆగస్ట్ 27:**–పట్టణంలోని రామాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు కుటుంబ సమేతంగా రావడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్ రాజు మాట్లాడుతూ...రాములవారి విగ్రహ ప్రతిష్టకు నన్ను కుటుంబంతో సహా ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉంది అన్నారు.ఆటోమొబైల్ ఫీల్డ్ లో వున్నపుడు వై ఎస్ ఆర్ కడప జిల్లా లోని మైదుకూరు,ప్రొద్దుటూరు,కడప ప్రాంతాల్లో తిరిగేవాడినని,ఆరోజులు మళ్ళీ ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. దైవసన్నిధిలో మంచి ప్రశాంతత లభిస్తుంది అన్నారు. ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేయాల్సిన భాద్యత పోరుమామిళ్ల ప్రజలమీద ఉందన్నారు. యువ కథానాయకుడు వంశీ కృష్ణ మాట్లాడుతూ...ఇది నా స్వంత ఊరు అని, మీ అందరి సపోర్ట్ నాకు ఎల్లపుడు ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లేరు విశ్వనాథ్ రెడ్డి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



# గుంతకల్లు వాసికి జాతీయ అవార్డు

## చత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ పురస్కారం

## అందుకున్న బంటనహాల్ హనుమంతు

## ప్రాణదాత సేవా సమితి సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు



**ఉరవకొండ మన జనప్రగతి ఆగస్టు 27**:-సమాజ సేవలో విశేషంగా కృషి చేస్తున్న గుంతకల్లు ప్రాణదాత సేవా సమితి సభ్యుడు బంటనహాల్ హనుమంతుకు ప్రతిష్ఠాత్మక చత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ పురస్కారం లభించింది. గురువారం గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని ప్రగడ కోటయ్య కళ్యాణ మండపంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.'మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్' పదో వార్షికోత్సవం సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాల్లో నిరంతరం సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, సేవకులను గుర్తించి సత్కరించారు.ఈ సందర్భంగా గుంతకల్లు ప్రాణదాత సేవా సమితి రక్తదానంతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో అందిస్తున్న సేవలను గుర్తించి చత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంగవీటి ఆశ కిరణ్ చేతుల మీదుగా బంటనహాల్ హనుమంతు పురస్కారాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ.. ఈ పురస్కారం తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. సమాజానికి మరింత అంకితభావంతో సేవలందించేందుకు అవార్డు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని ప్రాణదాత సేవా సమితి సభ్యులందరికీ అంకితం చేస్తున్నట్లు తెలిపారు.స్వచ్ఛంద రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటున్న ప్రాణదాత సేవా సమితి సేవలను గుర్తించి జాతీయ స్థాయి పురస్కారం అందించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

# బీసీ ఉద్యమ నేత పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్‌కు ఘన సన్మానం



**మార్కాపురం మన జనప్రగతి ఆగస్టు 27:-** బీసీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ, క్రిమిలేయర్‌తో పాటు బీసీ వర్గాలకు సంబంధించిన పలు సమస్యలపై పోరాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్‌ను బెంగళూరు నుంచి వచ్చిన వెంకట్ (ఫ్రెండ్స్) ఘనంగా సన్మానించారు.వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సహకారంతో పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ రాష్ట్ర పార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ తమ ప్రాంతానికి చెందిన లక్ష్మీప్రసాద్ యాదవ్ బీసీ హాస్టల్ సాధనతో పాటు పలు బీసీ ఉద్యమాల్లో అవిశ్రాంతంగా పోరాడారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఐక్యతతో ముందుకు సాగుతున్న ఆయన ఆయా వర్గాల సంక్షేమానికి మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో చిట్టిబాబు, రాజుపాల్, పుల్లయ్య, రాజు, కుమార్, పీఎంపీ యాదవ్, రిటైర్డ్ ఎస్ఐ మెట్ల చెంచయ్య యాదవ్, నాగం రామకృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్, రాంబాబు ముదిరాజ్, శీను ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**పులివెందుల మన జనప్రగతి ఆగస్టు 27:**-కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పులివెందులలో గురువారం కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ విభాగం అధ్యక్షుడు కొంగనపల్లి రవిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైఎస్ మనోహర్‌రెడ్డి, చవ్వా దుష్యంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి అవినాష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంపీ జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి (బస్సు భాస్కర్), మాజీ కౌన్సిలర్లు కోడి రమణ, పద్మనాభరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కోట్లూరు సుదర్శన్, తేర్నాంపల్లి భాస్కర్‌రెడ్డి, విజయ్‌కుమార్, కార్తీక్, లక్ష్మారెడ్డి, దేవర శ్రీనివాసరెడ్డి, సాక్షి శ్రీనివాసులు, ఇగనూరు బాబురెడ్డి, రవికుమార్, ఆదిరెడ్డి, కనక గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే రాయలసీమ సస్యశ్యామలం: మంత్రి సవిత



**పెనుకొండ/శ్రీసత్యసాయి, మన జనప్రగతి ఆగస్టు 27:-** సీఎం చంద్రబాబు హయాంలోనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.కూటమి ప్రభుత్వం రెండేళ్లలో హంద్రీ-నీవా ద్వారా రాయలసీమకు 50 టీఎంసీలకు పైగా కృష్ణా జలాలను తరలించి, 19 నియోజకవర్గాల్లో 420కుపైగా చెరువులను నింపినట్లు తెలిపారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు టీడీపీ హయాంలో రూ.12,500 కోట్లు ఖర్చు చేయగా, వైసీపీ ఐదేళ్ల పాలనలో కేవలం రూ.2,011 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని విమర్శించారు.పులివెందులకు సాగునీటితో పాటు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రూ.480 కోట్లతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పనులు త్వరలో పూర్తవుతాయని తెలిపారు. దీంతో 24 గంటలూ తాగునీరు అందించే అవకాశం ఉంటుందన్నారు.రాయలసీమ ప్రాజెక్టులపై వైసీపీ నేతలకు మాట్లాడే అర్హత లేదని విమర్శించిన మంత్రి, ప్రాజెక్టులపై వైసీపీతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ చేశారు.

# విద్యార్థుల మధ్య ఎంపీ అవినాష్‌రెడ్డి జన్మదిన సంబరాలు

- మాజీ సర్పంచ్ పార్వతమ్మ ఆధ్వర్యంలో వేడుకలు
- ఆట వస్తువులతో పాటు వాటర్ కూలింగ్ మిషన్ పంపిణీ





**వేల్పుల మన జనప్రగతి ఆగస్టు 27:-** విద్యార్థుల మధ్య కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి 42వ జన్మదిన వేడుకలను వేల్పులలో ఘనంగా నిర్వహించారు.గురువారం ఉదయం వైకాపా మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి (వేల్పుల రాము) తల్లి మాజీ సర్పంచ్ లింగాల పార్వతమ్మ ఆధ్వర్యంలో వేల్పుల అంకాలమ్మ పాఠశాలలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి ఎంపీ అవినాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల ఆట వస్తువులను అందజేయడంతో పాటు పాఠశాలకు వాటర్ కూలింగ్ మిషన్‌ను వితరణ చేశారు.అలాగే వేల్పుల,బెస్తవారిపల్లి ఎంపీపీ పాఠశాలలకు కూడా విద్యార్థుల కోసం ఆట వస్తువులను అందజేశారు.ఈ సందర్భంగా లింగాల పార్వతమ్మ మాట్లాడుతూ...ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థులు, యువత సంక్షేమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలనే ఉద్దేశంతో ఆట వస్తువులను అందించినట్లు తెలిపారు.పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొని ఎంపీ అవినాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# అమరావతిలో రూ.1,437 కోట్లతో మౌలిక వసతులు



**అమరావతి మన జనప్రగతి ఆగస్టు 27:-** రాజధాని అమరావతిలోని 29 గ్రామాల్లో రూ.1,437 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఇప్పటికే మంజూరైన రూ.904 కోట్లకు అదనంగా మరో రూ.533 కోట్ల పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపిందన్నారు.సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశం నిర్ణయాలను మంత్రి వెల్లడించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, లైటింగ్ తదితర సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. సీసీ రోడ్లకు బదులుగా బీటీ రోడ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు.శాకమూరులో సెంట్రల్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం తదితర భవనాల నిర్మాణానికి రూ.596 కోట్లతో పనులకు ఆమోదం లభించిందన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో భూములిస్తున్న రైతు కుటుంబాలకు 2026 జనవరి 1కి ముందు తీసుకున్న రుణాలపై గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు.మంగళగిరికి అమరావతి నుంచి తాగునీరు సరఫరా చేసేందుకు, ఐఓసీఎల్‌తో గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి ఎంఓయూ కుదుర్చుకునేందుకు అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. అమరావతిలో వివిధ ప్రైవేట్ ప్రాజెక్టుల కోసం 42 ఎకరాలు అభివృద్ధి చేయనున్నట్లు, తాడికొండ, కంతేరు ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్‌కు అనుమతి ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.

# విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి..!

**- తొండూరు ఎస్.ఐ శివనాగిరెడ్డి**



**తొండూరు మన జనప్రగతి ఆగస్టు 27**:-మండల పరిధిలోని స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు ర్యాగింగ్ నివారణ, రోడ్డు భద్రత, చెడు అలవాట్లకు దూరంగా ఉండటంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై శివనాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. చెడు అలవాట్లకు బానిసలు కావద్దని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112కు ఫోన్ చేయాలని తెలిపారు. రోడ్డు దాటే సమయంలో, రోడ్డుపై నడిచేటప్పుడు అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు.విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ఎలాంటి సమస్యలు ఎదురైనా ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని ఎస్సై సూచించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ ఫరూక్ ఉమర్ ఫరూక్,విద్యార్థినులు,హాస్టల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా శ్రీ సీతారామ,లక్ష్మణ, హనుమత్ విగ్రహ ప్రతిష్ఠ



**పోరుమామిళ్ల మన జనప్రగతి ఆగస్టు 27:-**పోరుమామిళ్లలో శ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమత్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు రెండో రోజు గురువారం వైభవంగా కొనసాగాయి. వేద పండితుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం, యంత్రాలకు అభిషేకాలు, గణపతి హోమం, పారాయణం, రుద్రస్వాకార హోమం, ఆదిత్యాది నవగ్రహ హోమం, వాస్తు హోమం, ఆవాహిత హోమం, చండీ హోమం, మంగళహారతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం చిరంజీవి ధన్య అద్విత భరతనాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం శ్రీ అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.సినీ ప్రముఖులు దిల్‌రాజు, యువ హీరో వంశీకృష్ణ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తుల కోసం నిర్వాహకులు చక్కటి భోజన వసతులు ఏర్పాటు చేశారు.ఈ మహత్తర కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న దేవస్థాన కమిటీ శాశ్వత అధ్యక్షులు జడప్రోలు శ్రీరాములు, ఆయన ధర్మపత్ని హైమావతి, అధ్యక్షులు దేరంగుల గురయ్య, కమిటీ సభ్యులను పలువురు ప్రజలు, భక్తులు అభినందించారు.

# మనోహరాబాద్‌లో ఉచిత పశువైద్య శిబిరం





**మనోహరాబాద్/తూప్రాన్, ఆగస్టు 27:-** గోసంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా పశువైద్య సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్. వెంకటయ్య అన్నారు. మనోహరాబాద్‌లోని శ్రీవాసు గోదామము గోశాలలో తూప్రాన్, చేగుంట లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా గోవులు, లేగదూడలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు, ఉచిత మందులు అందించారు. గోవుల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ సి.ఆర్. జానకిరామ్ మాట్లాడుతూ గోసేవ, గోసంరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గోవుల సంరక్షణకు గోశాల నిర్వాహకులు చేస్తున్న సేవలను అధికారులు అభినందించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, గోశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చాగలేరు వైకాపా శ్రేణులు

## - చాగలేరు ఎస్సీ కాలనీలో ఘనంగా వైఎస్ అవినాష్‌రెడ్డి 42వ జన్మదిన వేడుకలు

**వేముల మన జనప్రగతి ఆగస్టు 27:-** వేముల మండల పరిధిలోని చాగలేరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి 42వ జన్మదిన వేడుకలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనకు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నారు.పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని నాయకులు, కార్యకర్తలు కొనియాడారు.అనంతరం కార్యకర్తలు,యువత, అభిమానులు పరస్పరం మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అర్జున్,వైకాపా సీనియర్ నాయకులు కె.వి.రమణ,సి.ఉత్తయ్యతో పాటు వైకాపా నాయకులు,కార్యకర్తలు,యువత,అభిమానులు పాల్గొన్నారు.

# రేషన్ బస్తాలపై క్యూఆర్ కోడ్ స్కానింగ్ రద్దు చేయాలి

**• తహసిల్దార్‌కు రేషన్ డీలర్ల వినతి**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 27:-**రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాలకు సరఫరా చేసే రేషన్ బియ్యం బస్తాలపై కొత్తగా అమలు చేయనున్న క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని వేంపల్లి రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రేషన్ డీలర్ల సంఘ ప్రతినిధులు సింగారెడ్డి నాగిరెడ్డి చింపిరి ఈశ్వరయ్య,జేబీబుల్లా, సైపుల్లా, తదితరులు గురువారం తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసిల్దార్ జల్లా శివ శంకర్ రెడ్డి ఆర్ఐ శీలాలోకేష్ కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వంసెప్టెంబరు నెల నుంచి సరఫరా చేయనున్న 10 శాతం ఫోర్టిఫైడ్ రైస్ బస్తాలపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని డీలర్లకు ఆదేశాలు జారీ అయ్యాయని సంఘం ప్రతినిధులు తెలిపారు. అయితే మండల స్థాయి స్టాక్ పాయింట్ల వద్ద సరుకు నిర్వహణలో ఉన్న హమాలీలు, సంబంధిత అధికారులకు ఈ విధానం వర్తింపజేయకుండా కేవలం రేషన్ డీలర్లపైనే నిబంధనను అమలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు.చాలా మంది రేషన్ డీలర్ల వద్ద ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లు లేవని, డిజిటల్ పరిజ్ఞానం కూడా పరిమితంగా ఉండటంతో ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రతి బస్తాను స్కాన్ చేయడం ఇబ్బందికరంగా మారుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్, సర్వర్ సమస్యలు తలెత్తితే మరింత ఆలస్యం జరిగే అవకాశం ఉందన్నారు.ప్రతి నెలా ఒక్కో డీలర్ 100 నుంచి 300 కిలోల వరకు తరుగు నష్టాన్ని భరిస్తున్నారని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్ ఎస్ పాయింట్ల వద్ద తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించకుండా ప్రతి బస్తాను 50 కిలోల చొప్పున లెక్కించి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలని ఆదేశించడం వల్ల డీలర్లపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.సరుకును దిగుమతి చేసుకునే సమయంలో ఒకసారి, అనంతరం ఇ-పాస్ యంత్రాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసే సమయంలో మరోసారి స్కాన్ చేయాల్సి రావడంతో డీలర్లపై పనిభారం పెరుగుతుందని తెలిపారు. సర్వర్ సమస్యలు తలెత్తితే రేషన్ పంపిణీ ప్రక్రియ ఆలస్యమై లబ్ధిదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. రేషన్ డీలర్ల సమస్యలను దృష్టిలో ఉంచుకుని, డీలర్లకు తీవ్ర మనోవేదన కలిగిస్తున్న క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని పునఃసమీక్షించి వెంటనే రద్దు చేయాలని వారు తహసిల్దారును కోరారు.

# అన్నకు తగ్గ తమ్ముడు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

**• ప్రజలే అవినాష్‌కు సర్వస్వం**

**• వైకాపా నేతలు రవికుమార్ రెడ్డి, చంద్ర ఓబుల్ రెడ్డి రెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 27:-**అన్నకు వైయస్ జగన్ తగ్గ తమ్ముడు కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి అని వేంపల్లి జెడ్పిటిసి సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి మండల వైకాపా కన్వీనర్ కల్లూరు చంద్ర ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గండి రోడ్డులోని వైకాపా కార్యాలయంలో గురువారం మండల వైకాపా కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కేకును సదరు ఇరువురు నేతలు కత్తిరించి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంపీ అవినాష్ రెడ్డి కి ప్రజలే సర్వస్వమని నిరంతరం ప్రజల్లోనే తిరుగుతున్నారన్నారు. పులివెందులలో ప్రజానీకం ఎవరు నిద్రలేవక మునుపే చీకట్లోనే ప్రజా దర్బారు నిర్వహించే ఎంపీ అవినాష్ రెడ్డి లాంటి లీడర్ ఈ జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే ఉండరని వారు పేర్కొన్నారు. అవినాష్ రెడ్డి రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి అన్న జగన్ అడుగుజాడల్లో నడుస్తూ ఎప్పుడు ప్రజలు.. ప్రజలు.. అంటూ పర్యటనలు చేస్తుంటారన్నారు. అతి చిన్న వయసులోనే ప్రజల మద్దతుతో మూడుసార్లు ఎంపీగా గెలిచిన ఘనత అవినాష్ రెడ్డికే దక్కిందన్నారు.ఎప్పుడూ ప్రజల మధ్యలోనే ఉండే నాయకునికి గుర్తింపు, పదవులు వస్తాయంటే అందుకు నిదర్శనం ఎంపీ అవినాష్ అని వారు పేర్కొన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి అన్న జగన్ స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి నిరంతరం ప్రజాసేవకు అంకితం కావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండయ్య, ఎంపీటీసీ సభ్యులు కటిక చంద్ర, భారతి, హబీబుల్లా వైకాపా రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి నిషార్ భాష, పాస్టర్ రవికుమార్, వైకాపా రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ రెడ్డి, మండల వైకాపా ఉపాధ్యక్షులు మునీర్,రవిశంకర్ గౌడ్,వైకాపా నేతలు ముత్యాల అంజి,కమతం రాజా,కావలి బాలాజీ,మురుకుటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లెలో సర్ స్పెషల్ అబ్జర్వర్ పర్యటన



**మదనపల్లె,మన జనప్రగతి ఆగస్టు 27:-** తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సర్ స్పెషల్ అబ్జర్వర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు సూచించారు.మదనపల్లెలోని జిఆర్టి హైస్కూల్, పప్పిరెడ్డిపల్లి పురపాలక ప్రాథమిక పాఠశాలల్లోని 16/164, 89/164, 93/164 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలు, మరణించిన మరియు డూప్లికేట్ ఓటర్ల వివరాలు, ఒకే ఇంటి నంబర్‌పై అధిక ఓటర్ల నమోదు, ఫొటోలు లేని ఓటర్ల వివరాలను పరిశీలించి, తుది జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం త్యాగరాజు వీధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి ఓపీ, ఐపీ, ల్యాబ్ పరీక్షలు, రోగుల అడ్మిషన్లు, సిబ్బంది వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఎంహెచ్‌వో డా. శ్రీనివాసులు, డీసీహెచ్‌ఎస్ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రధాన రహదారే.. మురుగు మయం..!

**రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీటితో వాహనదారుల అవస్థలు**

**అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి..**





**వేముల మన జనప్రగతి ఆగస్టు 27:-**వేముల మండలం పరిధిలోని స్థానిక బెస్తవారిపల్లి గ్రామంలో కడపపులివెందుల ప్రధాన రహదారి మురుగు నీటితో నిండిపోవడంతో వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు పొంగిపొర్లి ప్రధాన రహదారిపైకి చేరుతోంది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మురుగు నీటిలోనే ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రహదారిపై నీరు నిలిచి ఉండటంతో వాహనాలు వెళ్లే సమయంలో పక్కకు మురుగు నీరు చిమ్మడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు.మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది.దీంతో పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.కడపపులివెందుల ప్రధాన రహదారి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు అదుపు తప్పే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. పాదచారులు సైతం రహదారి దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ లీకేజీని వెంటనే అరికట్టడంతో పాటు, మురుగు నీరు ప్రధాన రహదారిపైకి రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఉపాధ్యాయ సమస్యలపై ఎమ్మెల్సీకి ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుల వినతి



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 27:-**ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించనున్న ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ప్రత్యేక రాయితీలు కల్పించాలని కోరుతూ గురువారం ఉదయం రాయచోటిలో ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్షను కంప్యూటర్ ఆధారిత విధానంలో కాకుండా పెన్ అండ్ పేపర్ లేదా ఓఎంఆర్ విధానంలో నిర్వహించాలని కోరారు. ప్రశ్నపత్రంలో 60 శాతం ప్రశ్నలను ఉపాధ్యాయులు బోధించే ప్రధాన సబ్జెక్టు లేదా సంబంధిత విషయ పరిజ్ఞానం నుంచి ఇవ్వాలని, మిగిలిన ప్రశ్నల్లో బోధనా శాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం, బోధనా పద్ధతులు, తెలుగు, ఆంగ్లం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**రాయచోటిలో 16 శాతం హెచ్ఆర్ఏ కొనసాగించాలి**

అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లికి మారిన నేపథ్యంలో రాయచోటి పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు గతంలో ఉన్న 16 శాతం ఇంటి అద్దె భత్యాన్ని 12 శాతానికి తగ్గించడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 1,800 మంది ఉద్యోగులకు నెలకు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు నష్టం జరుగుతోందని తెలిపారు.రాయచోటి మున్సిపాలిటీకి ఉన్న ప్రత్యేక హోదాను పరిగణనలోకి తీసుకుని ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇంటి అద్దె భత్యాన్ని తిరిగి 12 శాతం నుంచి 16 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**డైట్‌లో అధ్యాపకుల పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలి**

రాష్ట్రంలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. అధ్యాపకుల కొరత కారణంగా ఉపాధ్యాయ శిక్షణపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. డైట్‌లలో ఖాళీగా ఉన్న ఉపన్యాసకులు, సీనియర్ ఉపన్యాసకుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని కోరారు.ఈ కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు అబ్బవరం హరిబాబు, రూట్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ హసీం, ఎన్‌టీఏ జిల్లా ఉపాధ్యక్షులు వంగిమళ్ల వేణుగోపాల్, పాలెం రాజా, ఉపాధ్యాయులు గౌరీ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం విషాద బాధిత కుటుంబానికి మంత్రి సత్యకుమార్ పరామర్శ



**బత్తలపల్లి, మన జనప్రగతి ఆగస్టు 27:-** శ్రీశైలంలో జరిగిన విషాద ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయిన బత్తలపల్లి టీచర్స్ కాలనీకి చెందిన గోకల రాముడు కుటుంబాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గురువారం పరామర్శించారు.ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, తహసీల్దార్ ఈశ్వర ప్రసాద్, ఎంపీడీవో కిష్టప్ప తదితర అధికారులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి, వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.తక్షణ సాయంగా తనవంతుగా రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రానున్న నెలలో కొత్త పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కష్టకాలంలో ఎవరూ అధైర్యపడవద్దని, సమస్యలను కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో పంచుకుని పరిష్కార మార్గాలను అన్వేషించాలని మంత్రి సూచించారు. ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలకు పాల్పడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆశీస్సులు



**ధర్మవరం,మన జనప్రగతి ఆగస్టు 27:-** ధర్మవరం రిపోర్టర్స్ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కేశగాల్ల శ్రీనివాసులు కుమార్తె ప్రియాంకగోపాలకృష్ణ నూతన దంపతులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గురువారం పరామర్శించి ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన రెడ్డి తనయుడు చిలకం జయవర్ధన్ రెడ్డి హల్దీ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. జయవర్ధన్ రెడ్డిని ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించిన మంత్రి, ఆయన నూతన జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.రాజకీయాలకు అతీతంగా కుటుంబ అనుబంధాలకు విలువనిస్తూ ప్రతి ఒక్కరి సంతోషంలో భాగస్వామిగా ఉండటం తన బాధ్యతగా భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# ఆగస్టు 29న 22ఏ బాధితుల కోసం అమీన్‌పూర్‌లో భారీ నిరసన



**పటాన్ చెరువు మన జనప్రగతి ఆగస్టు 27:-**పటాన్ చెరువు 22 ఏ నిషేధిత జాబితాలో చేరిన భూములు, ప్లాట్ల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు అండగా నిలిచేందుకు ఆగస్టు 29న అమీన్‌పూర్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ మేరకు పటాన్చెరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు.ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, 22 ఏ నిషేధిత జాబితాలో భూములు, ఫ్లాట్లు, ప్లాట్లు చేరడంతో వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. తమ ఆస్తులను విక్రయించలేక, రిజిస్ట్రేషన్లు జరగక, బ్యాంకు రుణాలు పొందలేక ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం నిరంతరంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే 22 ఏ జాబితాపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అర్హులైన బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, సమస్య పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.ఆగస్టు 29న అమీన్‌పూర్‌లో నిర్వహించే నిరసన కార్యక్రమంలో 22 ఏ బాధితులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, గృహ యజమానులు, ఫ్లాట్ యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సప్పన్నదేవ్, శంకర్ యాదవ్, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174